పొంచి ఉన్న ప్రమాదం... పట్టించుకోని యంత్రాంగం



రహదారిపై ఉన్న పెద్ద గొయ్యి



ప్రమాదకర గొయ్యి వద్ద స్తంభించిన ట్రాఫిక్

- గండిని పూడ్చకుండా రోడ్డుకు మరమ్మతులు
- అధికారుల నిర్వాకంతో విసుగుపోతున్న వాహనచోదకులు

డుంబ్రిగుడ: డుంబ్రిగుడ మండలం సరిహద్దులోని అరకు– అరకులోయ మధ్య ఎండపల్లివలస వద్ద ఉన్న వంతెన ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇటీవల వర్షాలకు ఈ వంతెన రోడ్డు కోతకు గురై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఈ రోడ్డుపై అక్కడక్కడ మరమ్మతు పనులు చేశారు. ఇందులో భాగంగా చిన్న చిన్న గుంతలు పూడ్చాయి. అయితే ఈ వంతెనపై ఉన్న పెద్ద గొయ్యిని పూడ్చకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుంది. నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కరించకపోవడంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు. గతంలో ఈపెద్ద గొయ్యి వద్ద బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. అయితే ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు చూడాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం గండిని పూడ్చకుండా రోడ్డుకు మరమ్మతులు చేశారని పలువురి ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుతో పాటు గొయ్యిని పూడ్చాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



సభ్యులతో నిర్వాహకులు

పాడేరురూరల్: విస్తృతంగా రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు చేస్తున్నట్టు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు తెలిపారు. కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అని పాఠశాలలు, కళాశాలలతో పాటు ఉద్యోగులతో సభ్యత్వ నమోదు చేస్తున్నమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సభ్యత్వ నమోదు చేసుకొని సొసైటీకి ఆర్థిక సాయమందించాలని కోరారు. ఏజెన్సీలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గౌరీశంకర్, సూర్యారావు, లోహిత్‌స్, ప్రసాద్, సంజీవరావు, గంగా భవానీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పోర్లిమ్మ

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3లక్షలతో 60 మీటర్ల సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ పోర్లిమ్మ కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా సీసీ రోడ్డు, డ్రైనేజీలు, తాగునీటి బోర్లు వేయనున్నట్టు చెప్పారు. ఉప సర్పంచ్ సాధురాం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరసింగరావు, వైఎస్సార్‌సీపీ నేతలు రాంబాబు, చందరరావు, జోగారావు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



మాట్లాడుతున్న పాస్టర్ జేమ్స్ క్రిస్టోఫర్

చింతపల్లి: చింతపల్లిలోని ఆదివాసీ ప్రభావిత పథం చర్చిలో సోమవారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తమిళనాడుకు చెందిన వరల్డ్ గాస్పల్ మిషన్ సొసైటీ పాస్టర్ జేమ్స్ క్రిస్టోఫర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమన్నారు. మతబోధకుడు ఈనక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సీనియర్ మతబోధకులు వి.సోమరాజు, బైబిల్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల్‌కుమార్, ఏసురత్నం, ముర్ల రమణ, రమణ, బుజ్జిబాబు, అశోక్ ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు



అర్జీలను స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: గిరిజనుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి వాటిని పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఐటీడీఏ సమావేశపు హాలులో సోమవారం సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ వారం 47 అర్జీలు వచ్చినట్లు పీవో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని వేటుకూర పంచాయతీలోని ఐదు గ్రామాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, వీధి లైట్లు మరమ్మతులు చేయించాలని కోరారు. జల్‌జీవన్ ద్వారా పనులు ప్రారంభించాలని తెలిపారు. పలు ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సమస్యలపై అర్జీలు అందజేశారు. ఏపీవో డీఎన్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చినుకులతో అన్నదాతల్లో గుబులు



నూర్పిళ్లు పూర్తయి ఎగుమతికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని టార్పాలిన్‌తో కప్పి ఉంచిన దృశ్యం



కల్లాంలో టార్పాలిన్‌తో కప్పి ఉన్న వరి పంట

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా ఇప్పటికే వరి కోతలు పూర్తి కాగా పండిన పంటలో కొంత కల్లాల్లో, మరికొంత పొలాల్లో ఉంది. కొన్ని చోట్ల నూర్పిళ్లు పూర్తికాగా ధాన్యాన్ని బస్తాల్లో నింపి విక్రయించుకోవాలని రైతులు చూస్తున్నారు. ఈ తరుణంలో మరోసారి అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు రైతన్నల గుండెల్లో మరోసారి గుబులు రేకెత్తుతోంది. సోమవారం రాత్రి మండలంలో వాన చినుకులు మొదలయ్యాయి. దీంతో రైతులకు కంటిపై కునుకు లేదు. ఖరీఫ్ పంట చేతికి వచ్చి ఇక కోతలు మొదలు పెట్టే సమయంలో ఇటీవల ఫెంగల్ తుపానుతో నష్టపోయారు. మిగిలి ఉన్న కొద్దిపాటు పంటలను విక్రయించుకోవాలనే తరుణంలో మారోమారు తుపాను హెచ్చరికలు జారీ కావడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వానచినుకులకు భయపడి పండిన పంటను టార్పాలిన్‌లతో కప్పి కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు

కొయ్యూరు: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పార్టీ అధ్యక్షుత పాంగి రాజారావు మాట్లాడుతూ జిల్లాలో బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. జిల్లాలోని 22 మండలాల రిటర్నింగ్ అధికారులను ఈనెల 26, 27న కొయ్యూరులో నియమించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రిటర్నింగ్ అధికారి గంగయ్య, ఏపీ ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు, నాయకులు రామకృష్ణ, కొండలదొర, కృష్ణారావు, చంద్రరావు, రీమెలరాజు, వెంకటరమణ, అప్పలరాజు, సత్తిబాబు, మంగతల్లి పాల్గొన్నారు.

ఎస్ఐగా వెంకటేష్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్

గంగవరం : గంగవరం నూతన ఎస్ఐగా బి.వెంకటేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసి డి.భూషణం రంపచోడవరం స్టేషన్‌కి అసిస్టెంట్ ఎస్ఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో పర్యటించి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో కోడి పందాలు నిర్వహించినా, సారా విక్రయాలు సాగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తొలుత గంగవరం, పాత గంగవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బాలికల హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ బాలయ్య మాట్లాడుతూ బాలికల హక్కులు, పరిరక్షణ, విద్య, ఉపాధి, భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల ఉన్నత, ఉజ్వల భవిష్యత్‌పై అందరూ దృష్టి సారించాలన్నారు. ఐసీడీఎస్ పీఓ రమణి, ఎంఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు పెంచాలి



కాఫీ రైతు సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు లక్కు

పాడేరు రూరల్: గిరిజన సహకార కో–ఆపరేటివ్ సంస్థ ప్రకటించిన కాఫీ ధర రైతులకు గిట్టుబాటు కాదని ఏపీ గిరిజన కాఫీ రైతు సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతు గిరిజన కో–ఆపరేటివ్ సంస్థ కిలో కాఫీ ధర రూ.320 ప్రకటించిందని, వాటిని కిలో కాఫీ ధర రూ.500కు పెంచాలని డిమాండ్ చేశారు. మన్యం కాఫీకు అంతర్జాతీయంగా ఎంతో మార్కెట్, గిరాకీ ఉన్నా గిరిజన రైతులకు గిట్టుబాటు లేదన్నారు. మన్యం కాఫీ కోసం ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం చేస్తుందని, ధరల్లో రైతులకు మొండిచేయి చూపిస్తోందన్నారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే ప్రభుత్వం కిలో కాఫీ ధర రూ.500లతో, కిలో చెర్రీ రూ.300, కిలో కాఫీ పండ్లు రూ.100లతో కొనుగోలు చేయాలన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న గిరిజన రైతులు పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులకు మాత్ర గిట్టుబాటు ధర లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించి కాఫీ రైతులను ఆదుకోవాలన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగరాహుల్

చింతూరు: చింతూరు డివిజన్‌లోని మండలాల్లో బెల్టు షాపులు నిర్వహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని రంపచోడవరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగ రాహుల్ అన్నారు. ఆయన చింతూరులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. చింతూరు డివిజన్‌కు ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులుగా ఉండడంతో ఆయా రాష్ట్రాలకు చెందిన మద్యం మన రాష్ట్రంలోకి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో గట్టినిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు. బెల్ట్ షాపులపై సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



చేపల్లిలో బోరు పనులను పరిశీలిస్తున్న భీమిలి సద్గురు సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ చేపల్లి గ్రామంలోని ఆదివాసీ గిరిజనులు(పీవీటీజీ) వీధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు భీమిలి సద్గురు సేవాశ్రమం, జి.మాడుగుల గాంధీనగరం పంచముఖ ఆంజనేయ సేవాశ్రమం వ్యవస్థాపకుడు సాయిరాం స్వామిజీ తమ సొంత నిధులతో బోరు నిర్మాణం చేపట్టారు. సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు మత్స్యరాస మత్స్యరాజు, చేపల్లి గ్రామానికి చెందిన రామానందచారి, ఆదివాసీల వినతి మేరకు సాయిరాం బోరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశామన్నారు. స్థానికులు స్వామిజీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు పనుల పరిశీలన



పనసపుట్టులో రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ కేంద్రంలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నాణ్యత పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. గత మూడేళ్లలో ఎన్నడూ జరగని అభివృద్ధి జెడ్పీ నిధులతో జరిగిందన్నారు. సర్పంచ్ నొయిన, వైఎస్సార్‌సీపీ నేత తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కోనాం నీటిమట్టం



కోనాం జలాశయం

చీడికాడ : ఇటీవల అల్పపీడన ప్రభావంతో ఏజెన్సీలో కురిసిన వర్షాలకు మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం రోజురోజుకు స్వల్పంగా పెరుగుతుంది. వివరాలోకి వెళితే జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయి నీటి మట్టం 101.25 మీటర్లు కాగా సోమవారం నాటికి 96.30 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలోకి 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా దిగువకు 40 క్యూసెక్కులు విడుదలౌతుంది. వరి కోతలు ముగియడంతో ఆయకట్టు పరిధిలో రైతులు వేరుశనగ, అపరాల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జలాశయంలో నీటిమట్టం పెరుగుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమౌతుంది.

రహదారి నిర్మాణంలో ప్రభుత్వం విఫలం



దీక్షలో మాట్లాడుతున్న ఆదివాసీ జిల్లా చైతన్య వేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి

వై.రామవరం: మండలంలోని ఎగువ ప్రాంతాలైన గుర్తేడు, పాతకోట గ్రామాలకు కలిపే ముఖ్యమైన ప్రధాన రహదారిని నిర్మించాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 8వ రోజుకు చేరాయి. ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి నిర్మాణంలో అటవీ శాఖ అభ్యంతరాలు చెబుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామస్తులకు రహదారి కలగా మిగిలిందన్నారు. ఉన్నతాధికారులు గిరిజనుల న్యాయపరమైన కోర్కెలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రహదారి నిర్మాణ విషయంపై వేదిక తరపున కోర్టుకు వెళ్లనున్నట్టు చెప్పారు. దీక్షలు చేస్తున్న నేతలకు స్థానిక ఆదివాసీలు నిమ్మరసం ఇచ్చి,తాత్కాలికంగా దీక్షలు విరమింపజేశారు. వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, లక్ష్మణరావు, త్రిమూర్తులు, నరసన్నదొర పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి



రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న జేఏసీ నేతలు, గ్రామస్తులు

కొయ్యూరు: ఆదివాసీలకు గృహ నిర్మాణాల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్ పథకం పక్కదారి పడుతోంది. పీఎం జన్‌మన్ పథకం కేవలం ఆదివాసీలకు మాత్రమే పరిమితమైనా పలుచోట్ల గిరిజనేతరులు బినామీ పేర్లతో అక్రమంగా గృహాలను పొందుతున్నారని జేఏసీ జిల్లా కమిటీ సభ్యులు పాడి లోవరాజు, శ్యామల వరలక్ష్మి, మండల ఆదివాసీ జేఏసీ నేతలు జేఏసీ నేతలు వాణీ ప్రకాశ్, పద్మ శ్రీనివాస్, రమణ తదితరులు చెప్పారు. మండలంలోని ఎం.మాకవరం పంచాయతీ పిట్టచలంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు అధికారులకు గ్రామాల్లో ఆదివాసీల బినామీ పేర్లతో గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని కోరారు. సర్పంచ్ కోతా చింతల్లి, ఎంపీటీసీ సభ్యుడు పాడుగు రత్నం, డీటీ అప్పన్న, వీఆర్వో వెంకయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెన్నుపాటికి ఘన నివాళి



గంగవరంలో చెన్నుపాటి వర్ధంతిలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

గంగవరం: ఉపాధ్యాయ, ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య జీవితం ఉపాధ్యాయులకు ఆదర్శనీయమని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో చెన్నుపాటి వర్ధంతిని యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. యూటీఎఫ్ మండల శాఖ మహిళా అధ్యక్షురాలు రుక్మిణీదేవి అధ్యక్షతన ఘనంగా జరిగింది. తొలుత చెన్నుపాటి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల అభ్యున్నతికి చెన్నుపాటి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. విజయలక్ష్మి, కుసుమకుమారి, లావణ్య, లక్ష్మి, గంతా లలిత, గంగా భవాని, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న వలంటీర్ల సంఘం సభ్యులు

హుకుంపేట: గ్రామ వలంటీర్లను రెగ్యులర్‌తో పాటు రూ.10వేలు వేతనం చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామిని అమలుచేయక మోసం చేసిందని, ఈ మేరకు ఈ నెల 26, 27, 28 తేదీల్లో రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్టు వలంటీర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లు కొండబాబు అన్నారు. మండల కేంద్రంలో వలంటీర్ యూనియన్ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీ నెరవేర్చకుండా అన్యాయం చేస్తుందన్నారు. వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో గ్రామల్లో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 26 తేదీ నుంచి చేపడుతున్న రిలే నిరహార దీక్షలో ఎక్కువ సంఖ్యలో తరలి రావాలని తెలిపారు. వలంటీర్ యూనియన్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి ముసిరి భవానిశంకర్, బాలరాజు, లక్ష్మణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

దేవరాపల్లి : పాత వాలాబు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు విద్యా సామాగ్రిని సమకూర్చారు. శ్రీ సత్య సేవా సంస్థ ప్రతినిధులు రావాడ శశిభూషణరావు, ఆదిరెడ్డి చినకన్నంనాయుడు తదితరులు 32 మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లతో పాటు టూత్ బ్రష్, టూత్ పేస్ట్, పౌడర్ తదితర సామాగ్రిని వితరణ చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.దండుమనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి సమక్షంలో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి ఆదిరెడ్డి చినకన్నబాబు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. హెచ్‌ఎం దండునాయుడు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో మేల్కొలుపులు

రోలుగుంట : ఈ నెల 16 న ప్రారంభమైన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కూడా స్థానిక శ్రీ సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో కొనసాగాయి. గ్రామంలో విష్ణుమూర్తి, గోదాదేవిల చిత్రపటాలతో చేపట్టిన రథసేవ సోమవారం కొండపాలెం చేరుకుంది. ఊరేగింపులో భజన బృందం భక్తి సంకీర్తనలు ఆలపించారు. ఈ మేల్కొలుపుల కార్యక్రమం వచ్చే నెల భోగి వరకూ సాగుతుందన్నారు. భక్తులు అందించిన కానుకలతో భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

దుస్తులు, దుప్పట్ల పంపిణీ



చెక్కరాయిలో ఆదివాసీలకు వంట సామగ్రి, దుస్తులు అందజేస్తున్న దాత మీనా

జి.మాడుగుల: మండలంలో చెక్కరాయి ఆదివాసీ గ్రామంలో స్థానికులకు దుస్తులు, దుప్పట్లు, వంట సామగ్రిని అమెరికాకు చెందిన డాక్టర్ మీనా అందజేశారు. చెక్కరాయి గ్రామాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెక్కరాయి గ్రామాన్ని సాయిరాం స్వామిజీ దత్తత తీసుకొని అభివృద్ధి పనులు చేయడం హర్షణీయమన్నారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కోరారు. దాత డాక్టర్ మీనా తమ గ్రామానికి వచ్చి సేవా కార్యక్రమాలు చేసినందుకు స్థానికులు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు మత్స్యరాస మత్స్యరాజు, పంతులరాజు, రామానందాచారి తదితరులు పాల్గొన్నారు.